కాకులూ పగబడతాయ్!

17 ఏండ్లపాటు ముఖాలను గుర్తుంచుకొంటాయ్ • తమకు అపాయం తలపెట్టినవారిపై కక్ష కడతాయ్
ద్వేషాన్ని తమ వారసులకు కూడా నూరిపోస్తాయ్ • అమెరికా పరిశోధకుల బృందం తాజా అధ్యయనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): పాములు పగబడతాయ్ అని చెప్తారు. ఏండ్లు గడిచినా ఏనుగులు మనుషుల ముఖాలను మర్చిపోవని పరిశోధనల్లో తేలింది కూడా. అయితే, రోజూచూసే కాకులు పగబడతాయని తెలుసా? తమకు అపకారాన్ని చేసిన వ్యక్తుల ముఖాలను ఏకంగా 17 ఏండ్లపాటు గుర్తుంచుకొంటాయంటే నమ్మగలమా? అంతేకాదు, 'మన కుటుంబానికి వాళ్లు అన్యాయం చేశారు. వదిలిపెట్టొద్దు' అంటూ పెద్ద కాకులు తమ సంతానానికి చెప్పిమరీ తనువు చాలిస్తాయని తెలుసా? అయితే, అమెరికాకు చెందిన ఓ పరిశోధక బృందం చేసిన తాజా అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

పరిశోధన జరిగింది ఇలా..

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జాన్ మార్జ్లఫ్ నేతృత్వంలోని పరిశోధక బృందం సభ్యులు 2006లో ముఖానికి గోస్ట్ మాస్క్‌లను ధరించి ఓ ఏడు కాకులను వలతో బంధించారు. అనంతరం వాటికి ఎలాంటి హాని చేయకుండా విడిచిపెట్టారు. ఆ కాకుల ప్రవర్తనను విశ్లేషించడానికి విడిచిపెట్టడానికంటే ముందే ఆ కాకుల కాళ్లకు కొన్ని రింగ్స్‌ను కట్టారు. కొన్నిరోజుల తర్వాత యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆ మాస్కులను ధరించి తాము వెళ్లినప్పుడు కొన్ని కాకులు తమ వైపునకు చూస్తూ గట్టిగా అదేపనిగా అరవడాన్ని గమనించారు. తొలుత కొన్ని కాకులే ఇలా చేయగా, ఏండ్లు గడుస్తున్న కొద్దీ వీటి సంఖ్య 47 వరకు చేరినట్టు తెలిపారు. చివరిసారిగా 2023 సెప్టెంబర్‌లో అంటే ప్రయోగం ప్రారంభించిన 17 ఏండ్ల తర్వాత ఇక మాస్కు ధరించిన తమ బృంద సభ్యులపై ఏ కాకి కూడా అరవకపోవడాన్ని తాము గుర్తించినట్టు వెల్లడించారు.

కాకుల సంఖ్య పెరిగింది అలా..

పరిశోధనలో భాగంగా ఏడు కాకులనే బంధించినప్పటికీ, ఒకానొక సమయంలో ఏకంగా 47 కాకులు తమ వైపు చూస్తూ ద్వేషాన్ని వ్యక్తం చేసినట్టు మార్జ్లఫ్ గుర్తుచేశారు. దీన్నిబట్టి తాము బంధించిన తల్లి కాకులు తమ సంతానానికి, బంధువులకు, సన్నిహితులకు ఆ ఉదంతాన్ని చెప్పి ఉండొచ్చని, ఈ కారణంచేతనే మాస్కు ధరించిన తమపై కొత్త కాకులు కూడా కక్ష పెంచుకొని ఉండొచ్చని మార్జ్లఫ్ అంచనా వేశారు. కాకులు గరిష్ఠంగా 20 ఏండ్లపాటు జీవనం సాగిస్తాయన్న విషయం తెలిసిందే. కాగా కర్మకాండల్లో భాగంగా పెట్టే పిండాన్ని కాకులు ఆరగించడం ఒక సంప్రదాయం. కాకులకు దివ్య దృష్టి ఉన్నదని, అవి ఆత్మలను కూడా చూడగలవని నమ్మేవారు కూడా ఉన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలు నేడే

- తొలి మహిళా అధ్యక్షురాలిగా కమల చరిత్ర సృష్టిస్తారా?
- ట్రంప్ మరోసారి అధ్యక్ష పీఠం అధిరోహిస్తారా?
- అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచ దేశాల్లో ఆసక్తి

వాషింగ్టన్: అమెరికా మొదటి మహిళా అధ్యక్షురాలిగా కమలహారిస్ చరిత్ర సృష్టిస్తారా? మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికై శ్వేతసౌధంలో అడుగిడాలన్న డొనాల్డ్ ట్రంప్ ఆశలు ఫలిస్తాయా? కమల, ట్రంప్ భవితవ్యంపై మరికొద్ది గంటల్లో అమెరికా ఓటర్లు తీర్పు చెప్పనున్నారు. అగ్రరాజ్య చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈసారి పోటీ నెలకొంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలాహారిస్.. నువ్వా నేనా అన్నట్టుగా తలపడుతున్నారు. స్థానిక నిబంధనల ప్రకారం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో పోలింగ్ ప్రారంభమవుతుంది. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల మధ్యలో పోలింగ్ ముగుస్తుంది. ఈ సమయాలు ఆయా కౌంటీలు, రాష్ట్రాలనుబట్టి వేర్వేరుగా ఉంటాయి. పోలింగ్ ముగిసిన వెంటనే ఫలితాల వెల్లడి ప్రారంభమవుతుంది. ఈ నెల 6 నుంచి డిసెంబరు 11 వరకు ఎన్నికల ఫలితాలను కౌంటీలు, రాష్ట్రాలు ధ్రువీకరిస్తాయి.

జనవరి 20న కొత్త అధ్యక్షుడి ప్రమాణం

2025 జనవరి 3న కొత్తగా ఎన్నికైన కంగ్రెషనల్ రిప్రజెంటేటివ్స్, సెనేటర్స్ ప్రమాణ స్వీకారం జరుగుతుంది. 2025 జనవరి 6న ఎలక్టొరల్ కాలేజ్ ఓట్లను కాంగ్రెస్ లెక్కిస్తుంది. దీని కోసం కాంగ్రెస్ ప్రత్యేక సంయుక్త సమావేశం జరుగుతుంది. 270 లేదా అంతకన్నా ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని దేశాధ్యక్షునిగా ప్రకటిస్తారు. దేశ ఉపాధ్యక్షునికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. 2025 జనవరి 20న మధ్యాహ్నం దేశాధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేస్తారు.

2020లో వైట్ హౌస్‌ను వదిలిపెట్టి ఉండాల్సింది కాదు: ట్రంప్

పోలింగ్ ప్రారంభమవడానికి కొద్ది గంటల ముందు రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2020లో తాను వైట్ హౌస్‌ను విడిచి వెళ్లకుండా ఉండవలసిందని అన్నారు. తన పదవీ కాలంలో ఎంతో గొప్పగా పని చేశానని నిజాయితీగా చెప్తున్నానని తెలిపారు. ఆ ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ గెలిచిన సంగతి తెలిసిందే.

సిద్ధరామయ్యకు సమన్లు

- ముడా స్కామ్‌లో జారీ చేసిన లోకాయుక్త
- బుధవారం విచారణకు రావాలని ఆదేశం
- హాజరవుతానన్న కర్ణాటక ముఖ్యమంత్రి
- డిసెంబర్ 24లోపు నివేదిక ఇవ్వాలన్న కోర్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): కన్నడ రాజకీయాలను కుదిపేస్తున్న ముడా స్కామ్‌లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ముడా (మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) స్కామ్‌లో కీలకంగా ఉన్న సీఎం సిద్ధరామయ్యకు లోకాయుక్త పోలీసులు సోమవారం సమన్లు జారీ చేశారు. బుధవారం ఉదయం విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు లోకాయుక్త ఉన్నతాధికారి ఒకరు పీటీఐ వార్తాసంస్థకు వెల్లడించారు. సమన్ల విషయమై సిద్ధరామయ్యను మీడియా ప్రశ్నించగా.. 'నేను విచారణకు హాజరవుతా..' అని ఆయన బదులిచ్చారు. కాగా, ఇదే స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య సతీమణి పార్వతి బీఎంను కూడా గత నెల 25న లోకాయుక్త పోలీసులు ప్రశ్నించారు.

ఏమిటీ స్కామ్?

బీజేపీ నేతలు, హక్కుల కార్యకర్తల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని (14 సైట్స్ కలిపి) కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు.

క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటు ందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే రూ. 4 వేల కోట్ల విలువజేసే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ముడా భూకుంభకోణంలో సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ స్కామ్ మూలంగా వేల కోట్లు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులకు, గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ సీఎంపై విచారణకు అనుమతినిచ్చారు.

కోర్టు డిస్మిస్ చేయడంతో సమన్లు

తనపై దర్యాప్తు జరిపేందుకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఇచ్చిన అనుమతిని సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, సిద్ధరామయ్య పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. పిటిషన్‌లో వివరించిన అంశాలపై నిస్సందేహంగా దర్యాప్తు జరిపించడం అవసరమని తెలిపింది. హైకోర్టు ఆదేశాలను బట్టి సీఎం సిద్ధరామయ్యను విచారించి రిపోర్టును డిసెంబర్ 24లోపు సమర్పించాలని ప్రత్యేక కోర్టు లోకాయుక్త పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సీఎం సిద్ధరామయ్యకు లోకాయుక్త పోలీసులు నోటీసులు పంపించినట్టు తెలుస్తున్నది.

ప్రధాని మా ఇంటికి రావటం తప్పేమీ కాదు

సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: గణపతి పూజ సందర్భంగా ప్రధాని మోదీ తన ఇంటికి రావటంలో తప్పేమీ లేదని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. ప్రధాని మోదీని తన ఇంటికి ఆహ్వానించటంపై విమర్శలు చేస్తున్నవాళ్లను ఉద్దేశించి సీజేఐ మరోమారు కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రెండు వ్యవస్థల బలోపేతం కోసం జరిగే చర్చల్ని గౌరవించాలని, అధికార విభజన ఉన్నంత మాత్రాన కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థకు చెందిన ఇద్దరు కలుసుకోకూడదని ఏమీ లేదని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఇలాంటి అంశాల్లో రాజకీయ పరిణతి చూపాల్సిన అవసరముందన్నారు. 'గణపతి పూజ కోసం మా ఇంటికి ప్రధాని వచ్చారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ మధ్య తరుచూ సమావేశాలు జరుగుతుంటాయి. గణతంత్ర దినోత్సవం వేళ రాష్ట్రపతి భవన్‌లో కలుసుకుంటాం. ఇదీ అలాంటిదే. మంత్రులు, ప్రధానితో జరిగే సమావేశాల్లో కేసుల ప్రస్తావన రాదు' అని అన్నారు.

రైల్వే 'సూపర్ యాప్'

- ఇకపై అన్ని సేవలు ఒకే చోట
- రెండు నెలల్లో అందుబాటులోకి

న్యూఢిల్లీ: ప్రయాణికులకు సంబంధించి అన్ని రకాల సేవలను ఒకే గొడుకు కిందకు తెస్తూ భారతీయ రైల్వే ఒక మొబైల్ అప్లికేషన్‌ను ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తీసుకురానుంది. ఈ 'సూపర్ యాప్'లో రైలు టికెట్లు, ప్లాట్‌ఫామ్ పాసులు బుక్ చేసుకోవడంతో పాటు రైళ్ల షెడ్యూళ్లు తదితర అంశాలు చూసుకోవచ్చు. ఆహారాన్ని కూడా ఆర్డర్ చేయొచ్చు. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సీఆర్ఐఎస్) ఈ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఇదే ఈ యాప్‌ను నిర్వహిస్తుంది.

లాహోర్‌లో గ్రీన్ లాక్‌డౌన్

లాహోర్: పాకిస్థాన్‌లోని లాహోర్‌లో గాలి కాలుష్యం తీవ్రంగా పెరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పరిమితి కన్నా 40 రెట్లు పెరిగింది. దీంతో ప్రపంచంలోని అత్యధిక కాలుష్యం గల నగరాల జాబితాలో లాహోర్ ప్రథమ స్థానంలో నిలిచింది. పంజాబ్ ప్రావిన్స్ సీనియర్ మంత్రి మరియం ఔరంగజేబ్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలకు ఈ నెల 4 నుంచి వారం రోజులపాటు సెలవులు ప్రకటించామన్నారు. 50 శాతం మంది ఉద్యోగులను ఇంటి వద్ద నుంచే పని చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. భారత దేశం నుంచి వస్తున్న గాలి లాహోర్‌లో కాలుష్యానికి కారణం అని పాక్ నేతలు ఆరోపిస్తున్నారు.

ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడాపై విదేశీ విద్యార్థుల విముఖత

- అమెరికా, న్యూజిలాండ్, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్ వైపు మొగ్గు
- వలస విధానాలు, వీసా నిబంధనలే కారణమన్న ఐడీఎఫ్ సర్వే

న్యూఢిల్లీ, నవంబర్ 4: విదేశీ విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులతోపాటు ఇతర దేశాల విద్యార్థులు ఇప్పటివరకు ప్రధానంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్‌కు వెళ్లేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ముఖ్యంగా బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడాకు వెళ్లేందుకు విదేశీ విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. విదేశీ విద్య కోసం జర్మనీ, జపాన్, ఫ్రాన్స్ లాంటి వర్ధమాన ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఇటీవల బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడాలో వలస విధానాలు మారడం, వీసా నిబంధనలు కఠినతరమవడం, అంతర్జాతీయ సంఘర్షణలు పెరుగుతుండటం ఇందుకు ప్రధాన కారణమని ఐడీఎఫ్ (ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) సర్వేలో తేలింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు నిర్వహించిన ఈ సర్వేలో 114 దేశాలకు చెందిన 6 వేల మందికిపైగా విద్యార్థుల అభిప్రాయాలను సేకరించారు. ఈ ఏడాది విదేశీ విద్యార్థుల్లో 24% మంది ఆస్ట్రేలియాను, 21% మంది బ్రిటన్‌ను ఎంచుకున్నారని, 16% మంది కెనడాను ఎంచుకున్నారని, ఇది నిరుటి కంటే 9% తక్కువని పేర్కొన్నది. భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరగడం, కెనడాలో వీసా నిబంధనలను కఠినతరం చేయడం ఇందుకు కారణమని తెలిపింది.

కెనడాలో ఖలిస్థానీల దుశ్చర్య

- బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం వద్ద భక్తులపై దాడి
- భారత్ ఆగ్రహం.. బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్

ఒట్టావా, నవంబర్ 4: కెనడాలో ఖలిస్థాన్ వేర్పాటువాదుల చర్యలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఆదివారం ఒంటారియో రాష్ట్రం బ్రాంప్టన్‌లో ఖలిస్థాన్ వేర్పాటువాదులు ఓ హిందూ ఆలయంపై దాడికి తెగబడ్డారు. ఖలిస్థాన్ జెండాలు చేతబూని.. ఆలయం వద్ద జరుగుతున్న హిందువుల సభపైకి దూసుకెళ్లారు. అందర్నీ భయభ్రాంతులకు గురిచేస్తూ.. సభకు హాజరైన హిందూ భక్తులపై దాడి చేసి ఇష్టమొచ్చినట్టు కొట్టారు. మహిళలను, పిల్లలను సైతం వేర్పాటువాదులు వదల్లేదని 'హిందూ కెనడియన్ ఫౌండేషన్' పేర్కొన్నది. కెనడాలో ఖలిస్థాన్ మద్దతుదారులతోనే ఇదంతా జరుగుతున్నదని ఆరోపించింది. ఈ ఘటన కెనడాలో తీవ్ర కలకలం రేపింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సహా వివిధ రాజకీయ నాయకులు ఘటనను ఖండించారు. దాడికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షిస్తామని బ్రాంప్టన్ మేయర్ ప్యాట్రిక్ బ్రౌన్ ప్రకటించారు. భక్తులపై దాడికి తెగబడటాన్ని కెనడా విపక్ష నేత పియేర్రె పొలివ్రీ తీవ్రంగా ఖండించారు. హిందువులకు భద్రత కల్పించటంలో కెనడా ప్రభుత్వం విఫలమైందని టొరొంటో ఎంపీ కెవిన్ వోంగ్ అన్నారు. 'బ్రాంప్టన్ దాడి ఎంతమాత్రమూ ఆమోదనీయం కాదు. కెనడాలోని ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా, సురక్షితంగా తన మత విశ్వాసాల్ని పాటించే హక్కు ఉంది' అని ప్రధా ని జస్టిన్ ట్రూడో 'ఎక్స్' వేదికగా స్పందించారు. హిందువులపై దాడిని కెనడా ఎంపీ చంద్ర ఆర్య తీవ్రంగా ఖండించారు. ఖలిస్థాన్ వేర్పాటువాదులు రెడ్ లైన్ దాటారని అన్నారు. 'ఖలిస్థాన్ వేర్పాటువాదుల తీవ్రవాదం కెనడాలో ఎంత నిస్సిగ్గుగా మారిందో తాజా ఘటన చూపుతున్నది. చట్టాల్ని అమలుజేసే ఏజెన్సీల్లో ఖలిస్థానీలు చొరబడ్డారన్న నివేదికల్లో నిజం ఉంది' అని అన్నారు.

భారత్ తీవ్ర ఆగ్రహం

బ్రాంప్టన్ ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దాడులు, వేధింపులతో కెనడాలో భారత దౌత్య అధికారులను బెదిరించలేరని స్పష్టం చేసింది. కెనడాలో భారత పౌరుల భద్రత, రక్షణ ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణదీర్ జైస్వాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. కెనడాలోని హిందూ ఆలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని జస్టిన్ ట్రూడో సర్కార్‌ను కోరారు. దాడి వెనుక భారత వ్యతిరేక శక్తులున్నాయని ఒట్టావాలోని భారత హైకమిషన్ కార్యాలయం పేర్కొన్నది. దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

పిరికిపందల చర్య: మోదీ

బ్రాంప్టన్‌లో హిందూ భక్తులపై దాడి ఘటనను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. కెనడాలో భారత దౌత్యవేత్తలను బెదిరించేందుకు పిరికిపందలు చేసిన ప్రయత్నంగా ప్రధాని పేర్కొన్నారు. న్యాయబద్ధమై, చట్టబద్ధమైన పాలనను అందించేందుకు కట్టుబడి ఉండాలని కెనడా ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి హింసాత్మక చర్యలతో భారత్ స్థైర్యాన్ని దెబ్బతీయలేరని అన్నారు.

సౌర విద్యుత్తు కారు!

- 1,600 కిలోమీటర్లు రేంజ్
- అమెరికా కంపెనీ తయారీ
- టెస్ట్ డ్రైవ్ విజయవంతం

వాషింగ్టన్, నవంబర్ 4: ఒక్కసారి బ్యాటరీ చార్జింగ్‌తో 1,600 కిలోమీటర్లు (వెయ్యి మైళ్లు) ప్రయాణించగల సౌర విద్యుత్తు కారును తీసుకొస్తున్నట్టు అమెరికాకు చెందిన విద్యుత్తు కార్ల తయారీ కంపెనీ ప్రకటించింది. శాన్‌డియాగోకు చెందిన 'అప్టేరా మోటార్స్' అభివృద్ధి చేసిన సౌర విద్యుత్తు కారు 'పీఐ 2'.. తొలి టెస్టింగ్‌లో అనూహ్య ఫలితాలు అందుకున్నట్టు కంపెనీ వర్గాలు తాజాగా వెల్లడించాయి. 'పీఐ 2' మొదటి టెస్ట్ డ్రైవ్ సక్సెస్ అయినట్టు తెలిపింది. కారు బాడీతో అనుసంధానం చేసిన సోలార్ ప్యానెల్స్‌తో రోజుకు కనీసం 40 మైళ్ల (63 కిలోమీటర్లు) వరకు ప్రయాణించగలగటం దీని ప్రత్యేకత. అటు తర్వాత బ్యాటరీ ప్యాక్‌తో కారు నడుస్తుంది. సౌర శక్తితో ఏడాదికి 11 వేల మైళ్ల డ్రైవింగ్ అందిస్తుందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి. 'పీఐ 2' తదుపరి పరీక్షలకు సిద్ధం అవుతున్నట్టు తెలిసింది.

8 గంటలు కూర్చుంటే వేగంగా వృద్ధాప్యం!

న్యూఢిల్లీ : ఇల్లు, కార్యాలయం, ప్రయాణాలు... ఇలా ఎక్కడైనా సరే రోజుకు 8.5 గంటలపాటు లేదా వారానికి 60 గంటలపాటు కూర్చుంటే అనారోగ్యంతోపాటు వేగంగా ముసలితనం వస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. అయితే, ప్రతి రోజూ 30 నిమిషాలసేపు పరుగెత్తడం లేదా సైక్లింగ్ వంటి వాటివల్ల కొంత వరకు ప్రయోజనం ఉండవచ్చు. యువత సుదీర్ఘ సమయం కూర్చోవడం వల్ల కొలెస్టరాల్, బాడీ మాస్ ఇండెక్స్‌లపై పడే ప్రభావం గురించి జరిగిన తాజా అధ్యయనం ఈ విషయాలను వెల్లడించింది. రోజుకు 8.5 గంటలపాటు కూర్చునే యువత, ప్రస్తుతం సిఫారసు చేసినట్లుగా కానీ, అంతకన్నా తక్కువగా కానీ వ్యాయామం చేస్తే, వారికి కార్డియోవాస్క్యులార్, మెటబాలిక్ వ్యాధులు ముప్పు సాధారణం నుంచి అతి ఎక్కువగా ఉండవచ్చునని ఈ పరిశోధకులు తెలిపారు. పని పూర్తయిన తర్వాత వేగంగా నడవడం ఈ ముప్పును తప్పించుకోవడానికి సరిపోదని చెప్పారు. స్టాండింగ్ డెస్క్‌ను వాడటం, మధ్యలో కొంత విరామం ఇస్తూ లేచి, కూర్చుంటుండటం, నడుస్తూ సమావేశాలు నిర్వహించడం వంటివి చేయాలని పరిశోధకులు సూచించారు.

వీసా ఫ్రీ ఎంట్రీ గడువు నిరవధిక పొడిగింపు

భారతీయులకు థాయ్‌లాండ్ శుభవార్త

న్యూఢిల్లీ: భారతీయ పర్యాటకుల కోసం ప్రవేశపెట్టిన వీసా ఫ్రీ ఎంట్రీ పాలసీని థాయ్‌లాండ్ నిరవధికంగా పొడిగించింది. ఈ పాలసీ గడువు ఈ నెల 11తో ముగియవలసి ఉంది. ఈ విధానం ప్రకారం, భారతీయులు థాయ్‌లాండ్‌లో 60 రోజులపాటు వీసా లేకుండా పర్యటించవచ్చు. ఈ సమయాన్ని స్థానిక ఇమిగ్రేషన్ కార్యాలయం ద్వారా మరో 30 రోజుల వరకు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. వీసా ఫ్రీ ఎంట్రీ గడువును నిరవధికంగా పొడిగించినట్లు న్యూఢిల్లీలోని రాయల్ థాయ్ ఎంబసీ ధ్రువీకరించింది.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం

- 2,000 మీటర్ల ఎత్తున ఎగసిపడిన బూడిద
- 10 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: ఇండోనేషియాలోని లెవోటోబీ లకి లకి అగ్నిపర్వతం సోమవారం అర్ధరాత్రి బద్దలైంది. బూడిద దాదాపు 2,000 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడింది. సమీపంలో ఉన్న ఓ గ్రామంలోని ఆరు ఇండ్లు కాలిపోయాయి. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. కూలిపోయిన ఇండ్ల కింద చాలా మంది చిక్కుకున్నారని స్థానిక మీడియా చెప్పింది. గత వారం నుంచి ఈ పర్వతంలో పేలుళ్లు సంభవిస్తున్నాయి. దీని వల్ల 10 వేల మంది ప్రజలు ప్రభావితులయ్యారని అధికారులు చెప్పారు. అగ్నిపర్వతం శిథిలాలు 6 కి.మీ. పరిధిలో చెల్లాచెదురుగా పడినట్లు తెలిపారు. ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారన్నారు.

కూలిన మిగ్-29

పైలట్ సురక్షితం

ఆగ్రా: భారత వాయుసేనకు చెందిన మిగ్-29 ఫైటర్‌జెట్ సోమవారం ఆగ్రా సమీపంలో కూలిపోయింది. సాధారణ శిక్షణలో భాగంగా పంజాబ్‌లోని అదంపూర్ నుంచి యూపీలోని ఆగ్రాకు ప్రయాణిస్తున్న ఈ యుద్ధవిమానం సాంకేతిక సమస్య కారణంగా కూలిపోయిందని అధికారులు తెలిపారు. పైలట్ సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగలేదన్నారు.

లోయలో పడ్డ బస్సు.. 36 మంది దుర్మరణం

- 24 మందికి గాయాలు
- ఉత్తరాఖండ్‌లో దుర్ఘటన

మర్చులా, నవంబర్ 4: ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో బస్సు అదుపుతప్పి లోయలో పడటంతో 36 మంది మృతి చెందారు. 24 మంది గాయపడ్డారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. దీపావళి తర్వాత స్వస్థలం నుంచి పని ప్రదేశానికి కార్మికులు తిరిగొస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. 43 సీట్ల సామర్థ్యం కలిగిన బస్సులో ప్రమాద సమయంలో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. గర్వాల్ మోటాల్ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని ప్రైవేట్ బస్ పౌరీ నుంచి రామ్ నగర్‌కు తిరిగొస్తుండగా ఉదయం 8 గంటలకు మర్చులా ప్రాంతంలో 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయిందని జిల్లా మెజిస్ట్రేట్ అలోక్ కుమార్ పాండే తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణిస్తుండటం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు, ఉత్తరాఖండ్ ప్రభుత్వం రూ.4 లక్షలు; గాయపడిన వారికి కేంద్రం రూ.50 వేలు, రాష్ట్ర సర్కారు రూ.1 లక్ష పరిహారం ప్రకటించాయి.

ప్రమాద స్థలిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

మత ప్రాతిపదికన కేరళ ఐఏఎస్ అధికారుల వాట్సాప్ గ్రూపులు

ఫోన్‌ను హ్యాక్ చేసి, తనను అడ్మిన్‌గా చేర్చారని ఓ అధికారి ఫిర్యాదు

తిరువనంతపురం : కేరళలోని ఐఏఎస్ అధికారులను మతపరంగా విభజించి, ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అయితే, రాష్ట్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కే గోపాలకృష్ణన్ (ఐఏఎస్) ఇదే అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫోన్‌ను హ్యాక్ చేసి, తనను కొత్త వాట్సాప్ గ్రూపులకు అడ్మిన్‌గా చేర్చారని ఆరోపించారు. 'మల్లు హిందూ అధికారులు', 'మల్లు ముస్లిం అధికారులు', మరికొన్ని గ్రూపులను క్రియేట్ చేశారని చెప్పారు. అక్టోబరు 30న మల్లు హిందూ అధికారుల గ్రూపును క్రియేట్ చేసి, దానిలో హిందూ ఐఏఎస్ అధికారులను చేర్చారని, దీని ఔచిత్యంపై చాలా మంది అధికారులు ప్రశ్నించడంతో దీనిని కొద్ది గంటల్లోనే డిలీట్ చేశారని తెలుస్తున్నది.

ఎన్నికల్లో పోటీపై జరాంగే యూటర్న్

ముంబై , నవంబర్ 4(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 15 సీట్లలో తమ అభ్యర్థులను నిలబెట్టుతున్నట్లు ప్రకటించిన మనోజ్ జరాంగే పాటిల్.. సోమవారం అకస్మాత్తుగా నిర్ణయం మార్చుకున్నారు. ఎన్నికల్లో తమ అభ్యర్థులను బరిలో దింపడం లేదని ప్రకటించారు. జరాంగే యూటర్న్ తీసుకోవడం వెనుక ఏం జరిగి ఉంటుందోనని వాదనలు మొదలయ్యాయి. జరాంగే సోమవారం ఉదయం అంతర్వాలి సారథి గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి నిలపరాదని నిర్ణయించినట్లు తెలిపారు. ఎవరిని ఓడించాలో, ఎవరిని గెలిపించాలో మరాఠాలే నిర్ణయిస్తారన్నారు. తాను ఏ అభ్యర్థికి కానీ, రాజకీయ పార్టీకి కానీ అనుబంధంగా లేనని, మద్దతివ్వడం లేదని చెప్పారు. ఎంవీఏ, మహాయుతి నేతల నుంచి తనపై ఒత్తిళ్లు లేవని స్పష్టం చేశారు.